## క్లుప్తంగా

### 14న సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14న ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయు డు హాజరు అవుతారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జెడ్పీటీసీ మండల గ్రామస్థాయి అధికారులు అందరూ పాల్గొని ఈకార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

### వరి పంట కోత ప్రయోగం



శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామంలో వరి పంట కోత ప్రయోగం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ సోమవారం తెలిపారు. గ్రామంలోని కౌలు రైతు కన్నెదారి ధనలక్ష్మి ఎకరం వరి పొలంలో పంట కోత ప్రయోగం చేయగా ఎకరానికి 30 బస్తాలు దిగుబడులు వచ్చినట్లు తెలిపారు. అలాగే మండలంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావం ధాటికి దెబ్బతిన్న పంటలను టీమ్స్ పరిశీలిస్తున్నాయన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులు సమగ్ర వివరాలు తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, రైతుభరోసా సహాయకులు శ్రీనివాసరావు, ఓరియంటల్ బీమా యోజన ప్రతినిధి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

### కుంగ్‌ఫూలో ఓవరాల్ చాంపియన్‌షిప్



చిలకలూరిపేట: జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు నందిగామలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న న్యూ షావోలిన్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు పాల్గొని కటా, స్పారింగ్ విభాగాల్లో విజయకేతనం ఎగురవేయడం ద్వారా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ విద్యార్థులకు సీఆర్ క్లబ్ ప్రాంగణంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. క్రీడలతో పాటు చదువులోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ట్రైనర్లు సూచించారు. కార్యక్రమంలో అకాడమీ మాస్టర్స్ షేక్ దరియావలి, కె.బ్రహ్మయ్య, బత్తుల విక్రమ్, యడ్ల సురేష్, పి. నాగరాజు, కె.రాంబాబు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రయాణీకుల నుంచి సూచనలు, సలహాలు తీసుకొని వారి సమస్యలను పరిష్కరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ, పరిసర గ్రామాల్లోని ప్రజలు పాల్గొని మెరుగైన సౌకర్యాలు అందజేసేందుకు సహకరించాలని కోరారు.

### నిబంధనల మేరకు క్లయిమ్‌ల నమోదు పాటించాలి

బొల్లాపల్లి: ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారమే ఓటరు చేర్పులు, మార్పులు ప్రక్రియ జరుగుతుందని తహసీల్దార్, ఏఈఆర్‌ఓ ఎస్. దుర్గేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 9తో ఓటరు చేర్పులు, మార్పులు దరఖాస్తు ప్రక్రియ ముగిసిందన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించి విచారణ చేపట్టామని, ఈనెల 20 వరకు పోలింగ్ బూత్ స్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు. అనంతరం జనవరి 5న తుది ఓటరు ముసాయిదా జాబితా వెలువడుతుందన్నారు. బూత్‌లెవల్ అధికారులు 30 క్లయిమ్‌లకు మించరాదని, పౌరులకి 5 క్లయిమ్‌లు కన్న ఎక్కువ నమోదు చేసుకోరాదని, క్లయిమ్‌లు మించి అధికంగా జరిగితే ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

### బ్రాహ్మణ భవన నిర్మాణానికి సహకరించాలి

చిలకలూరిపేట: బ్రాహ్మణ భవన నిర్మాణానికి సహకరించాలని ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు చల్లా విజయకుమార్ కోరారు. బ్రాహ్మణ కార్తిక వన సమారాధన కార్యక్రమం పట్టణంలోని విజ్ఞాన్ విహార్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. అందరికీ ఉపయోగపడేలా నిర్మాణ పనులు చేపట్టనున్న బ్రాహ్మణభవన్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని చెప్పారు. న్యాయవాది గిరిరాజు మాట్లాడుతూ బ్రాహ్మణులు సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఐక్యతకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఏకా మారుతీశర్మ, కార్యదర్శిగా పోలూరి రామచంద్రమౌళి, కోశాధికారిగా పావులూరి శేషగిరిరావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

# డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.24 వేల కోట్ల లబ్ధి

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- షాలెంనగర్‌లో డ్వాక్రా మహిళలు, పేదలకు తోపుడు బండ్లు, గ్రైండర్లు, మిక్సీలు, చీరెలు పంపిణీ



టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నరసరావుపేట: డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డు షాలెంనగర్‌లో పంచాయతీ రాజ్ డీఈ హరనాథ్ తండ్రి రామకోటి సంస్మరణ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గతంలో చంద్రబాబు కూడా రుణమాఫీ చేస్తానని చెప్పి చేయకపోవటంతో వారి ఖాతాలన్నీ నాన్ ఆపరేటివ్ ఖాతాలుగా మారి సీ, డీ గ్రేడ్‌లుగా మారాయన్నారు. అయితే సీఎం జగన్ వచ్చిన తర్వాత ఏడాదికి రూ.6 వేల కోట్లు జమచేస్తూ వచ్చారన్నారు. దీంతో ఏగ్రేడ్ ఖాతాలుగా మారడంతో బ్యాంకుల వారు మళ్లీ రుణాలు ఇచ్చేందుకు డ్వాక్రా అక్కచెల్లెమ్మల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి వృద్ధులకు ఇళ్లకే పింఛన్లు అందచేస్తున్నారని, వైఎస్సార్ చేయూత, అందరికీ ఇళ్లు లాంటి పథకాలు మహిళలపేర్లపై అమలుచేసి వారికి లబ్ధి చేకూర్చారన్నారు. మీ కుటుంబానికి మేలుచేస్తేనే తనకు మళ్లీ ఓటేయాలని సీఎం జగన్ కోరారని వివరించారు. యువత రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే జీడీసీసీ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తానని సూచించారు. గాబ్రియేలు మొదటి నుంచి వైఎస్సార్‌సీపీలో ఉంటూ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఈ సందర్భంగా 100 మంది డ్వాక్రా మహిళలకు మిక్సీలు, గ్రైండర్లు, పది మందికి తోపుడు బండ్లు, మరో 100 మంది వృద్ధ మహిళలకు చీరెలు, 50 మంది వృద్ధులకు పంచెలు, కండువాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, గిరిజన, మాదిగ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, నకరికల్లు మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భవనం రాఘవరెడ్డి, యువజన విభాగ కార్యదర్శి గోగుల శంకర్, జిల్లా ఎస్సీసెల్ మెంబరు మల్లెల అశోక్, డీఇ కె.హరనాథ్, వార్డు నాయకులు పుష్పరాజు, వాసుపల్లి మాణిక్యాలరావు, జి.స్వరూపారాణి, వజ్రమ్మ పాల్గొన్నారు.

**రెడ్‌క్రాస్ ఏర్పాటు సంతోషదాయకం**

నరసరావుపేట: పల్నాడు జిల్లా ఏర్పాటు కావటం ఎంత అదృష్టమో, ఆ జిల్లాకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఏర్పాటు చేయటం చాలా సంతోషించతగ్గ విషయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తొమ్మిదో వార్డులో ఇటీవల కురిసిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రెడ్‌క్రాస్ సహాయంతో అత్యంత మన్నికైన టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ప్రజలకు మేలు చేకూర్చే పనుల్లో భాగస్వామ్యమౌతున్నారన్నారు. పేదల గృహాలు మంటల్లో కాలినా, పడిపోయినా వెంటనే ఆదుకుంటున్నారన్నారు. లింగంగుంట్లలోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాలలో రూ.3.5 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునాతనమైన బ్లడ్‌సెంటర్ ఏర్పాటుకు రెడ్‌క్రాస్ ముందుకురావటంతో జిల్లా ప్రజల అదృష్టమన్నారు. మరో నెలరోజుల్లో ఆ సెంటర్ ప్రారంభించటం జరుగుతుందన్నారు. తుపాను కారణంగా పట్టణంలో సుమారు పది గృహాలు దెబ్బతిన్నాయని, వారికి ప్రభుత్వం ద్వారా ఇంటికి రూ.10 వేలుచొప్పున ఆర్థిక సహాయం త్వరలో అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్, ఆ వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మున్సిపల్ న్యాయవాది సింధుకూరి శ్రీనివాసరావు పాల్గన్నారు.

### క్రీస్తు మార్గం ఆచరణీయం

రొంపిచర్ల: ఏసుక్రీస్తు చూపిన మార్గము ఆచరణీయమని శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బిసి కాలనీలో గల ఎస్‌డీఏ చర్చిలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి పాస్టర్స్ ఘనంగా స్వాగతం పలికారు. చర్చిలో జరిగిన సెమీక్రిస్మస్ వేడుకలలో సెమీక్రిస్మస్ కేక్ ను శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కట్ చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని పాస్టర్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటప్పకొండ సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ బి.ఆర్.సుశీల్ కుమార్, పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు పి.జీవానందం, మాజీ అధ్యక్షుడు ఎం.ప్రభుదాస్, జాన్ జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాలరెడ్డి, పడాల చక్రారెడ్డి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, వెంకట్రావు, మండల నాయకులు వెంకటేష్, పాస్టర్స్ పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బొల్లాపల్లి మండలం పలుకూరు తండాకు చెందిన మూడావత్ రమేష్‌నాయక్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1.80లక్షల ఆర్థికసాయం చెక్కును ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అందిస్తున్న సాయాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్యశిబిరం

బొల్లాపల్లి: స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాటూరు మెడికల్ కాలే జ్ కమ్ హాస్పటల్స్ వైద్యులు వైద్యసేవలు అందజేశారు. షుగర్, బీపీ, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పి. వెంకట్రావు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 200 మందికి పైగా వైద్యసేవలు అందజేశామని, మెగా వైద్యశిబిరానికి హాజరైన రోగులకు ఉచిత భోజన సదుపాయం కల్పించామని నిర్వాహకులు తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం శుక్లముల ఆపరేషన్లు అవసరమైన వారికి కాటూరి మెడికల్ హాస్పటల్స్ వారి సౌజన్యంతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

# కార్తికమాస వేడుకలు శుభసంప్రదాయం



భక్తులకు అన్నదానం అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా



గణపవరంలో స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో విప్పర్ల శివాలయంలోని వల్లభేశ్వరస్వామి

**ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు**

శావల్యాపురం: కార్తికమాసం వేడుకలు జరుపుకోవటం మంచి సంప్రదాయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. కార్తికమాసం నాల్గవ సోమవారం సందర్భంగా మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి సన్నిధిలో సుచరిత ఎడ్యుకేషన్ సొసైటీ శ్రీరామా పబ్లిక్ స్కూలు వారి సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధన వేడుకల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుచరిత ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతి ఏటా కార్తిక మాస వేడుకలునిర్వహించటం అభినందనీయమన్నారు. పచ్చని చెట్లు చక్కటి వాతావరణం మధ్య అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేయటం వేడుకలకు నిదర్శమన్నారు. ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు విద్యతో పాటు సంస్కృతులు సంప్రదాయాలు పట్ల ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన మంచి బోధన బోధించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం పలువురుకు ఆదర్శమన్నారు. అనంతరం విద్యార్థులకు సంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతా విజయ్ కుమార్, అడవి పేరంటాళ్ళమ్మ దేవాలయం చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బోడాల వీరాంజనేయులు, అల్లూరి వెంకయ్య, పాఠశాల కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్ చందు, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టరు అజిత్‌చంద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**పాత శివాలయంలో అన్నదానం**

వినుకొండ(నూజెండ్ల): కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా పట్టణంలోని పాత శివాలయంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీక్షాస్వాములకు, సాధారణ భక్తులకు చద్దివితరణ కార్యక్రమంలో పాల్గొని స్వాములకు స్వయంగా వడ్డించారు. ఆలయ కమిటీ సభ్యులు దీక్షా స్వాములు పాల్గొన్నారు.

**శావల్యాపురంలో...**

శావల్యాపురం: నాల్గవ సోమవారం కార్తికమాసం వేడుకలు భక్తులు అత్యంత భక్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మండలంలోని వేల్పూరు, మతుకుమల్లి, పోట్లూరు, శావల్యాపురం, గంటావారిపాలెం, కారుమంచి, తదితర గ్రామాల్లో వేంచేసియున్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు దేవాలయ ప్రాంగణంలో మట్టి ప్రమిదలు, ఆవునెయ్యితో దీపాలు వెలిగించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీరామ లింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ పూజారీ రావిపాటి సాయి భరత్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అర్చనలు అభిషేకాలు ప్రత్యేకంగా నిర్వహించారు.

**రొంపిచర్లలో..**

రొంపిచర్ల: మండలంలోని ఆలయాలన్ని సోమవారం తెల్లవారు జామునుండే భక్తులతో పోటెత్తాయి. కార్తిక మాసంలో చివరి సోమవారం కావటంతో మహిళా భక్తులు ఎక్కువ మంది ఆలయాలను సందర్శించి దీపారాధనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరి కొందరు దేవాలయాలకు వచ్చే భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

**సొలసలో...**

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానంలో దీపాలు దేదీప్య వెలుగులు విరజిమ్మాయి. కార్తిక మాసం ప్రారంభం నుంచి నిత్యం కాంతులతో ఆలయం ధగధగ మెరుస్తుంది. ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొంటున్నారు. సోమవారం సాయంత్రం ఆలయం ప్రాంగణంలో మహిళలు అధికంగా పాల్గొని ముక్కోటి దేవతల్లో ప్రథమపూజితుడైన గణనాథుని రూపాన్ని రంగవల్లులతో అలంకరించి..ప్రమిదలను ఏర్పాటు చేసి దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

**నరసరావుపేటలో...**

నరసరావుపేట ఈస్ట్: కార్తిక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలు హరనామ స్మరణతో మారుమ్రోగాయి. తెల్లవారు జాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు ఆలయాలకు చేరుకొని కార్తిక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. పాతూరులోని భీమలింగేశ్వర స్వామి ఆలయం, రావిపాడురోడ్డులోని శ్రీకళ్యాణ సుందరేశ్వర స్వామి ఆలయం, బరంపేటలోని శ్రీవాయు మల్లేశ్వరస్వామి ఆలయం, పాలపాడురోడ్డులోని శ్రీచినసింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు జరిపారు.

**గణపవరంలో అన్నాభిషేకం**

నాదెండ్ల: గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి వాసవీ కన్యకాపరమేశ్వరి సహిత కోదండ రామాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కార్తిక మాస పూజలు రెండో రోజు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం భవానీ శంకర స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు వైభవంగా అన్నాభిషేకం చేశారు. చివరి రోజు మంగళవారం లక్ష్మీ గణపతి నవగ్రహ రుద్ర హోమాలు జరగనున్నట్లు ఆలయ ప్రధాన పూజార్లు దర్శి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. కొన్ని ఆలయాల వద్ద ఉదయాన్నే భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# టీడీపీ వారు.. అభివృద్ధిని చూడలేని కబోదులు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో 20 వేలకు పైగా దొంగ ఓట్లు చేర్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే జి.వి.దే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూడలేని కబోదుల్లా టీడీపీ పార్టీ నాయకులు తయారయ్యారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో అభివృద్ధి చేయక పోగా తమ పాలనలో జరిగిన అభివృద్ధి కూడా టీడీపీ వారికి కన్పించడం లేదన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణంతోపాటు, వందల కోట్ల నాడు నేడు నిధులతో అభివృద్ధి చేశామన్నారు. అలాగే 2.44 లక్షల కోట్ల రూపాయలు సంక్షేమం రూపంలో ప్రజలకు నేరుగా అందించినట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు తుఫాను బారినపడ్డ రైతుల వద్దకు వెళ్లి ఫొటోలకు ఫోజులు ఇచ్చి పచ్చ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం తప్ప రైతులకు చేసిందేమీ లేదన్నారు. నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి, అన్నివిధాలా రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమదేనన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేవిధంగా చంద్రబాబుతో పాటు, టీడీపీ నాయకులు మాట్లాడుతున్నరని ఎవరూ భయపడేవారు లేరన్నారు. రెండు నెలల్లో మేమే అధికారంలోకి వస్తామని మీఅంతు చూస్తామని తమ నాయకులను కూడా టీడీపీ భయపెడుతోందని ఇలాంటి చేష్టలతోనే 2019లో ప్రజలు టీడీపీకి బుద్ధి చెప్పారన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాన్‌ను నమ్మే స్థితిలో ఎవరూ లేరని, తెలంగాణా ఎన్నికల్లో 8 చోట్ల పోటీ చేస్తే డిపాజిట్లు కూడా లేకుండా ఓడిపోయారని ఆంధ్రాలో కూడా ఇదేగతి పడుతుందన్నారు.

**వినుకొండలో 20 వేల దొంగ ఓట్లు టీడీపీవే**

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వినుకొండ నియోజకవర్గంలో 20 వేలకు పైగా దొంగ ఓట్లు చేర్పించిన ఘనత మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులదేన్నారు. డబుల్ ఎంట్రీలను అధికారులు తొలగిస్తుంటే తమ ఓట్లు తీసివేస్తున్నారని ఏకంగా తహసీల్దార్లపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. జీవీ సొంత ఇంటిలో 25 ఓట్లు నమోదు చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. నూజెండ్ల మండలం గురప్పనాయుడి పాలెం, టి.అన్నారం, ముతరాసుపాలెం, కమ్మవారి పాలెం గ్రామాలల్లో జనాభా కంటే ఓట్లు ఎక్కువగా నమోదు చేసింది ఎవరని ప్రశ్నించారు. ఒక్కొక్కరికీ రెండు చోట్ల ఓట్లు ఉంటే అధికారులు తొలగిస్తున్నారన్నారు. నిజాయితీగా పోటీ చేసి ఎదుర్కొనే దమ్ములేక దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యేకు దమ్ము ఉంటే తనపై పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ గుండాల స్వెనోమ్, సొసైటీ అధ్యక్షులు దూమావత్ గోవిందునాయక్, బొల్లాపల్లి మండల నాయకులు, మట్టి రాజయ్య, తిప్పిశెట్టి కోటేశ్వరరావు, అవినాష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కళల విందు... కనుల నిండు

- డైట్ కళాశాలలో కళాఉత్సవ్ పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు




నృత్య పోటీల్లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

యడ్లపాడు: విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లోనూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. బోయపాలెంలోని జిల్లా విద్యాశిక్షణ ప్రాంగణంలో సోమవారం కళా ఉత్సవ్ 2023–24 పోటీలను ఆయన ప్రారంభించారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, సాంప్రదాయక, జానపద నృత్యాల విభాగాలలో నిర్వహించిన ఆయా పోటీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా కొనసాగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఎవరికీ వారే పోటాపోటీగా తమ కళారూపాల్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుభాని మాట్లాడుతూ తక్కువ సమయంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ కళానైపుణ్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. మంగళవారం కూడా పోటీలు కొనసాగుతాయన్నారు. పోటీలను కళా ఉత్సవ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్, కళాశాల అధ్యాపకులు పి పోలేరు, కె.యోగేశ్వరరావు పర్యవేక్షించారు.

## బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం బాలికలు



ఆకుమళ్ళ సమీరా



ముక్కపాటి లిఖిత

శావల్యాపురం: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కోచ్ పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 8వ నుంచి 10 వరకు అనంతపురం జిల్లాలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఆకుమళ్ళ సమీరా మంచి ప్రతిభను చూపి సౌత్‌జోన్ కేరళ, తమిళనాడు,గోవా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.అలాగే పాఠశాల పూర్వ విద్యార్థి ముక్కపాటి లిఖిత సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ మహిళ విభాగంలో జాతీయ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. జనవరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఇరువురు విద్యార్థినులు పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నిర్మల, అబ్దుల్లా, గురుబాబు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## చౌకబియ్యం పట్టివేత

చిలకలూరిపేట: అక్రమంగా తరలిస్తున్న చౌకబియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందిన విశ్వసనీయమైన సమాచారం మేరకు మండలంలోని గంగన్నపాలెం గ్రామ శివారులో చౌకబియ్యం తరలిస్తున్న లారీని సోమవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు. ఈ లారీలో సివిల్ సప్‌లైస్ శాఖకు చెందిన గోతాల్లో 112 బస్తాల రేషన్ బియ్యంతో పాటు మరో 21 ప్లాస్టిక్ గోతాల్లో చౌకబియ్యం పట్టుబడింది. మొత్తం 133 బస్తాలకు సంబంధించి 66.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ. 2.32 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించి, యడ్లపాడుకు చెందిన లారీ డ్రైవర్ ఇలవరపు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.

## గ్రామాల్లో ముమ్మరంగా పంటనష్టం అంచనాలు



మైదవోలులో వివరాలు నమోదు చేసుకుంటున్న గ్రామస్థాయి సర్వే బృందం

యడ్లపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయి సర్వే మొదలైంది. ఈదురు గాలులు, అధిక వర్షాలు, వరద ముప్పు కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను అధికారుల బృందం సోమవారం సందర్శించింది. గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ సహాయకులు కలిసి సదరు పంట నష్ట పరిమితిని అంచనా వేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత తెలిపారు. ఈనెల 9 నుంచే అంచనాల ప్రక్రియ మొదలైందని 16 తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కావున మండలం పరిధిలో 33 శాతానికి మించి పంట నష్టపోయిన పొలాలను చూపించి సహకరించాలని కోరారు.

## వేంకటేశ్వరస్వామికి వెండి పద్మాల సమర్పణ

చిలకలూరిపేట: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండప ప్రాంగణంలో ఉన్న కళ్యాణవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెండితో రూపొందించిన 108 పద్మాలను భక్తులు సోమవారం సమర్పించారు. రాచుమల్లు రాఘవులు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సుమారు రెండున్నర కేజీల వెండితో 108 పద్మాలను చేయించి ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా అష్టదళ పాదపద్మపూజ నిర్వహించేందుకు వీటిని బహూకరించినట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాచుమల్లు జానకిదేవి, సునీల్, అనీల్, ఆలయకమిటీ సభ్యులు ఎ.వెంకట్రావు, ప్రతాప్, ఆలయ అర్చకులు రామకృష్ణ పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి కానుకల లెక్కింపు

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ హుండీ సోమవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. దేవదాయశాఖ అధికారులు తులసీదాస్, గాదె రామిరెడ్డి ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీ నుంచి సోమవారం వరకూ లెక్కింపు నిర్వహించగా, రూ.44,650లు ఆదాయం లభించింది. ఇటీవల ఈ ఆలయం దేవదాయశాఖలో విలీనమైన విషయం విదితమే. కార్యక్రమంలో స్థానిక పెద్దలు కస్తూరి కృష్ణారావు, గంగినేని అప్పారావు, కాట్రగడ్డ సుబ్బారావు, గుడికందుల యల్లారావు, బత్తిన శ్రీనివాసరావు, మలిపెద్ది శివకామేశ్వరరావు, ఆలయ పూజారి ఇర్లపాటి సురేష్‌కుమార్ శర్మ ఉన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

నరసరావుపేట రూరల్: బరంపేట బైపాస్ రోడ్డులో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ రోడ్డుకు పక్కగా నున్న విద్యుత్ పోల్‌ను ఢీకొట్టి ముళ్లపొదల్లో పడి మృతిచెందాడు. స్థానిక సమాచారం మేరకు రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బరంపేటకు చెందిన చింతకాయల నాగేశ్వరరావు (42)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రీసర్వేపై రైతులు అభ్యంతరాలుంటే తెలపాలి

నాదెండ్ల: బ్రిటీష్ జమానాలో జరిగిన భూముల సర్వే రికార్డులను ప్రక్షాళన చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో భూములను రీ సర్వే నిర్వహించటంతో దశాబ్దాల భూ తగవులకు తెర పడుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం 1వ సచివాలయంలో సోమవారం జగనన్న శాశ్వత భూ హక్కు–భూ సర్వే, మీ భూమి మా హామీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పరిధిలో 4595 యకరాల భూమికి గాను 1800 మందికి పైగా రైతులు ఉన్నారు. ఈ ఏడాది మే 28న గ్రౌండ్ క్రూతింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సర్వే పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రీసర్వేలో శతాబ్దాల కాలం నాటి భూ సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు. తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రీసర్వే పనులు పూర్తయ్యాయని, రైతులకు 9(2) నోటీసులు అందిస్తున్నామని, దీనిపై రైతులు అభ్యంతరాలు ఉన్నట్లయితే మొబైల్ టీమ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీ అనురాధ, కౌన్సిలర్ తులం సుధాకర్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, కాటా వెంకటేశ్వర్లు, సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, వీఆర్వోలు సాంబశివరావు, వెంకటరమణ పాల్గొన్నారు.